
నమస్తే తెలంగాణ





జగిత్యాల జిల్లా భీమారం మండలం గోవిందారంలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

# మేం భూములియ్యం

- సూరమ్మ చెరువు కుడి కాలువకు భూ సేకరణ నిలిపేయండి
- ఎస్సారెస్పీ పునర్జీవం ద్వారా నీటిని తరలించండి: గోవిందారం రైతులు

మేడిపల్లి, డిసెంబర్ 3: సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ కుడి కాలువ నిర్మాణం కోసం తమ భూములు ఇచ్చేది లేదని జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని గోవిందారం, దేశాయిపేట, రాజ లింగంపేట రైతులు స్పష్టం చేశారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టుగా ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా నీటిని ఎత్తిపోసి చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. కథలాపూర్ మండలం సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ కుడి కాలువ నిర్మాణం కోసం గోవిందారం రెవెన్యూ పరిధిలో భూసేకరణకు వారం క్రితం ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వగా, మంగళవారం తహసీల్దార్ రవికిరణ్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు సంతకాలు చేయకుండా బహిష్కరించారు. భూ సేకరణను నిలిపేసి, ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, కుడికాలువ భూ సేకరణతో చిన్న, సన్నకారు రైతులకు జీవనాధారమైన భూములు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా వరదకాలువను నిండుగా మార్చి చెరువులను నింపుతామని మాజీ సర్పంచ్ కాటిపల్లి శ్రీపాల్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారని, ఆ మేరకు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సర్వే చేయించారని గుర్తు చేశారు. కుడి కాలువ భూసేరకరణ నిలిపివేసి, కేసీఆర్ సర్కారు చేసిన సర్వే ప్రకారం చెరువులను నింపాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కరండ్ల మధుకర్, నాంచారి స్వప్న, రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, నాయకుడు అన్నాడి జలపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## లోకం పోకడ




మాకు ఓటేసి గెలిపించినందుకు మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేం రైతన్నా!

# రుణమాఫీ అయిపోయిందా?



### సగం మందికే రుణమాఫీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తమని చెప్పి సగం మందికే చేసింది. నేను బ్యాంకులో రూ.1,42,000 క్రాప్‌లోన్ తీసుకున్న. సర్కారు ప్రకటించిన జాబితాలో నా పేరు లేదు. ఎన్నికలప్పుడు రైతు భరోసా అని చెప్పి ఇప్పటి వరకు దాని జాడేలేదు. సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు మాటలు చెప్పి మోసం చేసి గద్దెనెక్కిండు. రైతుల పాపం ఊరికనే పోదు. వాళ్లని గోస పెట్టిన ప్రభుత్వం నిలబడ్డ చరిత్ర లేదు. – మారెళ్ల రామయ్య, రైతు, ఖాసింపల్లి, భూపాలపల్లి



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో రుణమాఫీ చేయాలని ప్లకార్డులతో ధర్నా చేస్తున్న రైతులు

## రుణమాఫీ చేయకపోతే ఆత్మహత్యలే!

### నర్సింహులపేటలో ప్లకార్డులతో రైతుల నిరసన

నర్సింహులపేట, డిసెంబర్ 3: రుణమాఫీ చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రైతులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా నాయకుడు మందుల యాకూబ్ మాట్లాడుతూ.. ఇంకా చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని అన్నారు. అధికారుల తప్పిదంతో రైతుల బ్యాంకు ఖాతాలకు వేరే రైతు ఆధార్ కార్డు నంబర్ నమోదు చేయడంతో సమస్యలు ఏర్పడ్డాయని, పలుమార్లు అధికారులకు దరఖాస్తు చేసినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. కుటుంబం యూనిట్‌గా తీసుకున్నప్పటికీ ఇతర కుటుంబాల వారిని అధికారులు జత చేయడంతో సమస్యలు ఉత్పన్నమైనట్టు తెలిపారు. అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలని, లేకపోతే రైతులతో కలిసి దీక్షలు చేస్తామని హెచ్చరించారు.

## రైతులను మోసం చేసిన రేవంత్

- సీఎంపై రైతు జేఏసీ నేతల ఆగ్రహం

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 3: సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని రైతు జేఏసీ నేతలు మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని కుమార్‌నారాయణ్‌భవన్‌లో రైతు జేఏసీ ప్రతినిధులు ఇట్టెడి లింగారెడ్డి, ప్రభాకర్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఒక్కో గ్రామంలో కనీసం 10 శాతం మందికి కూడా మాఫీ వర్తించలేదని స్పష్టం చేశారు. వంద శాతం రుణమాఫీ చేయడం బోగస్ అని, ఒక గ్రామంలో 300 మంది రైతులు ఉంటే అందులో నాలుగు విడతల్లో కలిపి 30 మందికి మాత్రమే రుణమాఫీ అయిందని చెప్పారు.



ఆర్మూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న రైతు జేఏసీ ప్రతినిధులు లింగారెడ్డి, ప్రభాకర్

### మాఫీ కాలే.. అప్పు పెరిగింది



నేను రూ.లక్ష, నా భార్య సుభద్ర రూ.90వేలు బ్యాంకులో పంట రుణం తీసుకున్నం. మిత్తితో కలిసి మొత్తం రూ. 2.50 లక్షలైనయ్. నా కొడుకు రూ. లక్షా 50వేలు తీసుకున్నడు. రెండు లక్షల కంటే ఎక్కువ ఉంటే మాఫీ కాదని అంటే అప్పు తీసుకొచ్చి రూ. 52 వేలు కట్టిన. ఇప్పటికీ రుణమాఫీ కాలేదు. రేషన్ కార్డు లేకపోవడంతో నా కొడుకుకూ రుణ మాఫీ కాలేదు. కాంగ్రె స్ సర్కారు మాటలు నమ్మితే మరింత అప్పు అయ్యింది. – జిట్టబోయిన వెంకటయ్య, రైతు, ఇప్పగూడం, స్టేషన్‌ఘన్‌పూర్

### ఇప్పుడూ నా పేరు రాలేదు..



నాకు 5.10 ఎకరాల భూమి ఉన్నది. పంట సాగు కోసం దంతాలపల్లి బ్యాంకులో 1.50 లక్షల రుణం తీసుకున్న. బ్యాంకు వాళ్లు రూ. 10,500 మిత్తి కడితే మాఫీ వస్తుందంటే కట్టిన. నాలుగో విడతలోనూ నా పేరు రాలే. సీఎం రేవంత్‌రెడ్డి 2లక్షలు తీసుకున్న ప్రతి ఒక్కరికీ రుణం మాఫీ చేశామంటున్నడు. కానీ మా ఊరిలో చాలామందికి రుణమాఫీ కాలే. – జంగాల సోమలక్ష్మి, దంతాలపల్లి, మహబూబాబాద్

### నెలల తరబడి తిప్పిస్తున్నరు



ఆధార్ కార్డు పేరు తప్పుగా పడింది. అం దుకే రుణమాఫీ రాలేద ని నెలల తరబడి తిప్పిస్తున్నరు. చెన్నారావుపేటలోని సహకార సంఘంలో అప్పు తీసుకున్న. సొసైటీ, వ్యవసాయ అధికారులు పేరు తప్పుగా ఉందని, సరిచేస్తమంటున్నరు. నాలుగు విడతలుగా రుణమాఫీ చేసినా నా పేరు మాత్రం రాలేదు. ఎన్నికలప్పు డు అందరికీ రుణ మాఫీ చేయిస్తమని చెప్పి ఇ ప్పుడు ఆధార్ కార్డు పేరు తప్పు ఉన్నదని, రేష న్ కార్డు లేదని చెప్తున్నరు. –మర్రి మల్లయ్య, చెన్నారావుపేట, వరంగల్

### వడ్డీ కట్టినా రుణమాఫీ కాలే..



కో ఆపరేటివ్ బ్యాంకులో రూ.2.40 లక్షలు రుణం తీసుకున్నాం. కొత్త ప్రభుత్వం రాగానే రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పినా.. మాకు మాఫీ వర్తించలేదు. బ్యాంకు అధికారులను అడిగితే రూ.40 వేలు కట్టండి.. రూ.2 లక్షలు రుణమాఫీ అవుతుందని చెబితే కట్టేశాం. ఇప్పటివరకు రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం ఇట్ల చేస్తదని అనుకోలే. – ధర్మసోతు క్రాంతి, మహిళా రైతు, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

### పేరు తప్పు ఉందని తిప్పారు..



అకౌంట్లో పేరు తప్పు పడ్డది ..అందుకే రుణమాఫీ కాలేదని నాలుగు నెలలుగా తిప్పుతున్నారు. నేను ఎదులాపురం సొసైటీలో తీసుకున్న అప్పు, అసలు కలిపి రూ.1.30 లక్షలు. నాకు అప్పట్లోనే రుణమాఫీ రావాల్సి ఉంది. ఆధార్‌కార్డులో ఇం కో పేరు కనపడుతుందని చెప్పారు. కొద్దిరోజుల తరువాత సొసైటీ వాళ్లు పేరు మార్చి నా పేరు పెట్టామని ఓ కాగితం కూడా ఇచ్చారు. అది తీసుకుపోయి ఏఈవోకు ఇవ్వగా వచ్చే జాబితాలో పేరు వస్తది అన్నారు. ఈ రోజు మళ్లీ వచ్చి అడిగితే మళ్లా వేరే అతని పేరే కనపడుతున్నదని చెప్తున్నారు. – బుర్ర ఉప్పలయ్య, కొండాపురం, ఖమ్మం

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 15.0°c | 29.0°c |
| నల్లగొండ | 19.4°c | 29.5°c |
| రంగారెడ్డి | 20.9°c | 21.0°c |
| ఆదిలాబాద్ | 21.1°c | 32.1°c |
| మెదక్ | 21.4°c | 34.1°c |
| హైదరాబాద్ | 22.1°c | 29.0°c |
| నిజామాబాద్ | 22.8°c | 23.2°c |
| కరీంనగర్ | 23.0°c | 30.0°c |
| వరంగల్ | 23.0°c | 29.0°c |
| ఖమ్మం | 23.0°c | 31.0°c |

## తెలంగాణ మరువని అమరుడు శ్రీకాంతాచారి

### బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మరువని అమరుడు శ్రీకాంతాచారి అని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. 'శ్రీకాంతాచారి అమరత్వం గొప్పది. ఆయన ప్రాణత్యాగాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరు. తెలంగాణ ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండ, కేసీఆర్ అరెస్టును చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి అగ్నికి ఆహుతై అమరుడయ్యాడు' అని ఎక్స్ వేదికగా గుర్తుచేసుకున్నారు. శ్రీకాంతాచారి ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసిపడేలా చేసిందని, శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా జోహార్లు అర్పిస్తున్నానని తెలిపారు. 'జోహార్ శ్రీకాంతాచారి!.. జై తెలంగాణ' అని పేర్కొన్నారు.

## మరో రైతు ఆత్మహత్య

### అప్పు తీర్చే మార్గం కానరాక మనస్తాపం

### వరంగల్ జిల్లాలో బలవన్మరణం



నెక్కొండ, డిసెంబర్ 3 : సాగు, కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక వరంగల్ జిల్లాలో మంగళవారం ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నెక్కొండ మండలం దీక్షకుంటకు చెందిన తోట సంపత్ (47)కు ముగ్గురు కొడుకులు. వారి చదువులు, ట్రాక్టర్ కొనుగోలుకు రూ. 20 లక్షల వరకు అప్పు అయ్యింది. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు నర్సంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా, మంగళవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వ దవాఖానకు వెళ్లి రైతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే రైతు కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఆదర్శ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

### ఐదుగురు విద్యార్థినులకు అస్వస్థత

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబర్ 3 : నల్లగొండ జిల్లా పీఏపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతిగృహంలో ఫుడ్ పాయిజన్‌తో ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ నిర్వాహకులు వారిని దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆదర్శ పాఠశాల వసతి గృహానికి కొద్ది రోజులుగా ఇన్‌చార్జి లేకపోవడంతో కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అన్నం వండే బియ్యం క్వాలిటీగా ఉండడం లేదని పలుమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని తహసీల్దార్ శ్రీనివాసులుతో విద్యార్థినులు వాపోయారు. మంగళవారం వండిన అన్నం చాలామంది తినకపోగా, తిన్నవారు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.

## థాయ్‌లాండ్‌లో ఇద్దరు తెలంగాణవాసులు అదృశ్యం

హైదరాబాద్: ఉద్యోగ అవకాశాల కోసం థాయ్‌లాండ్ వెళ్లిన ఇద్దరు తెలంగాణ వాసులు అదృశ్యమైనట్లు తెలిసింది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మోహన్‌రావుపేట్‌కు చెందిన శనిగరపు అరవింద్, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని షెట్‌పల్లికి చెందిన కొండా సాగర్‌గా వారిని గుర్తించారు. జగిత్యాల జిల్లాకు చెందిన సమ్మెట రాజు అనే రిక్రూటింగ్ ఏజెంట్‌కు రూ. 2 లక్షలు చెల్లించి విజిటింగ్ వీసాపై వారిద్దరూ థాయ్‌లాండ్‌కు వెళ్లినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. నవంబర్ 11న బ్యాంకాక్ చేరుకున్న వారిద్దరూ ఆ తర్వాత ఆచూకీ లేకుండాపోయారని ఆరోపించారు. తమవారి ఆచూకీ కనుగొనేందుకు రాష్ట్రప్రభుత్వం, భారత ఎంబసీ సహకరించాలని కోరారు.



వేములవాడలోని బోయినపల్లి గురుకుల పాఠశాల వద్దకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

## పేదబిడ్డలను కలవకుండా నిర్బంధమా?

### తనను అడ్డుకున్న అధికారులపై మాజీ ఎమ్మెల్యే సుంకె ఆగ్రహం

బీఆర్‌ఎస్ గురుకుల బాట

వేములవాడ, డిసెంబర్ 3 : గురుకుల పాఠశాలల్లో పేద బిడ్డల కష్టాలను తెలుసుకునేందుకు వెళ్తున్న తమను కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేసి అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గురుకులాల తనిఖీ ఇన్‌చార్జి వెంగళ శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి ఆయన వేములవాడలోని బోయినపల్లి గురుకుల బాలుర పాఠశాల, కళాశాల పరిశీలనకు వెళ్లారు. వారు పాఠశాల లోపలికి వెళ్లకుండా పోలీసులు, అధికారులు గేటుకు అడ్డంగా నిలుచున్నారు. సీఐ వీరప్రసాద్, ఎస్సై రమేశ్, ఆర్ ఏఎస్‌ఐతోపాటు పదిమంది పోలీసులను పాఠశాల భవనం వద్ద బందోబస్తు నిర్వహించారు. అనుమతులు లేవంటూ అడ్డుకున్నారు. ఆ తర్వాత కొంతసేపటికి అధికారులు కేవలం రవిశంకర్‌తోపాటు శ్రీకాంత్‌గౌడ్‌ను అనుమతించారు. వెంట వచ్చిన నాయకులు, కార్యకర్తలను అడ్డుకోవడంతో వారు గేటు బయట నిలిచిపోయారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. తెలంగాణలోని దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ బిడ్డలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కేసీఆర్ 1029 పాఠశాలలను నెలకొల్పారని, ఒక్కో విద్యార్థిపై రూ.1.20 లక్షలు ఖర్చు చేసి నాణ్యమైన పౌష్టికాహారంతోపాటు మెరుగైన విద్యను అందించిన విషయాన్ని గుర్తుచేశారు. అలాంటి గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పట్టించుకోకపోవడంతో విద్యార్థుల జీవితాలు అధ్వానంగా మారినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత ఆహారం తిని వందలాదిమంది అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. పదుల సంఖ్యలో విద్యార్థుల మరణించడం, ఆత్మహత్యలు వంటివి జరుగుతున్నా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు.

#### పరిశీలనకు ముందే తనిఖీలు

వేములవాడలోని బోయినపల్లి గురుకుల కళాశాలను పరిశీలించడానికి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ వసున్నట్టు సమాచారం అందుకున్న బోయినపల్లి ఎంపీడీవో జయశీల, విద్యాధికారి శ్రావణ్‌కుమార్ ముందుగానే అక్కడికి చేరుకుని గురుకుల పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. అన్నీ చూసిన తర్వాతనే బీఆర్‌ఎస్ నేతలను లోనికి అనుమతించారు.

## విద్యార్థులను పొట్టన పెట్టుకుంటరా?


- గురుకులాల్లో మెరుగైన భోజనం ఏది?
- పరిశీలనకు వెళ్తే గేట్లకు తాళాలు వేస్తారా?
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్పీ ఫైర్

రాజాపేట, డిసెంబర్ 3 : సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో మంది పేద విద్యార్థులను పొట్టన పెట్టుకున్న దుర్మార్గుడని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయన లోపలికి రాకుండా పాఠశాల గేటుకు తాళం వేశారు. దాంతో స్కూల్ గేటు ముందు కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో గురుకులాలు స్వర్ణయుగంలా కొనసాగిన విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ నాయకులను నిర్బంధించినంత మాత్రాన పోరాటం ఆగదని హెచ్చరించారు. గురుకులాల్లో దుర్మార్గంగా ఆంక్షలు విధించడం సిగ్గుచేటని అన్నారు. ఫుడ్ పాయిజన్‌తో రాష్ట్రంలో 48 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకున్న దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ 11 నెలల పాలనలో గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మధ్యా హ్న భోజనం తినే విద్యార్థుల పరిస్థితి చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు కనీసం నీటివసతి కూడా లేదని, నాణ్యమైన భోజనం అందించడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా ఆలేరు పట్టణ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు తుంగ బాలు, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆంజనేయులుగౌడ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.



రాజాపేట గురుకులం గేటు బయట విద్యార్థిని అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు

## • 'గురుకుల బాట'లో ఉద్రిక్తత



గురుకుల బాటలో భాగంగా మడికొండలో సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలుర పాఠశాల సందర్శనకు వెళ్లిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు ఆవాల రాధికారెడ్డి, లావుడ్యా రవి నాయక్‌ను పోలీసులు అడ్డుకున్నారు. రాకేశ్‌రెడ్డితో పాటు సుమారు 50 మంది బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. -మడికొండ



పడేసిన మధ్యాహ్న భోజనం..

## నాసిరకం బియ్యంతో మధ్యాహ్న భోజనం

### తినలేక పడేసిన విద్యార్థులు

### వికారాబాద్ జిల్లా మర్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘటన

వికారాబాద్/మర్పల్లి, డిసెంబర్ 3 : వికారాబాద్ జిల్లా మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యతలేని అన్నం వడ్డించడంతో మంగళవారం విద్యార్థులు తినలేక పడేశారు.. పాఠశాలలో 160 మంది విద్యార్థులు ఉన్నారు. కొన్ని రోజులుగా మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉంటున్నదని, ముద్దలు ముద్దలుగా రావడంతో పాటు కూరలు కూడా ముక్కుబడిగా చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎంఈవో అంజిలయ్య స్పందిస్తూ తమకు వచ్చే బియ్యం సరిగ్గా లేవని సమాధానమిచ్చారు.



కాసిపేటలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులను నిలువరిస్తున్న పోలీసులు

## గురుకులాల బాటకు అడ్డంకులు

హాజీపూర్/కాసిపేట/బెల్లంపల్లి, డిసెంబర్ 3 : బీఆర్‌ఎస్ చేపట్టిన గురుకుల బాటను అధికారులు, పోలీసులు అడుగడుగునా అడ్డుకుంటున్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే, ముల్కల్లలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలను సందర్శించేందుకు మంగళవారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు చెన్నమల్ల చైతన్య నాయకులతో కలిసి వెళ్లారు. విద్యాలయాల్లోకి వెళ్లకుండా ప్రిన్సిపాళ్లు అడ్డుకోగా, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయాచోట్ల ప్రధాన ద్వారాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాసిపేట మండలం రేగులగూడ ఆశ్రమ పాఠశాల, బెల్లంపల్లిలోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల,కళాశాల సందర్శనకు బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్.. నాయకులతో కలిసి వెళ్లగా హెచ్‌ఎం, సిబ్బంది లోపలికి రాకుండా తాళాలు వేయడంతో వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాల గేటు ముందు ధర్నా చేశారు. సిబ్బంది గేట్‌కు తాళం వేయడంపై మండిపడ్డారు.

## విద్యార్థుల చావులకు రేవంతే బాధ్యుడు

### ఏడాదైనా విద్యాశాఖకు మంత్రే లేడు: బీఆర్‌ఎస్ నేత అరవింద్‌శర్మ

ఆర్కేపురం, డిసెంబర్ 3 : గురుకుల పాఠశాలల విద్యార్థుల చావులకు సీఎం రేవంత్‌రెడ్డి కారణమని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్ ఆరోపించారు. అల్కాపురిలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, మధ్యాహ్నం భోజన నాణ్యత గురించి ప్రిన్సిపల్ అనిత, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా విద్యాశాఖకు మంత్రినే నియమించకుండా నిర్లక్ష్యం చేసినట్టు విమర్శించారు.